# దరి చేరిన నత్త-గువ్వలు

## — పి. రాజేశ్వరి

అందంలో రతీదేవి, ఆస్తిలో లక్ష్మీదేవి చదువులో సరస్వతీదేవి, సామర్థ్యంలో పార్వతీదేవిలతో సరితూగ గల వధువునే వరించాలని సన్యాసిరావు సంకల్పం, ఆకాంక్ష కూడా. అయితే, ఆ నలుగురు 'దేవి'ల పతి దేవుళ్లైన మన్మధుడు, విష్ణుమూర్తి, బ్రహ్మ, మహేశ్వరులతో 'సరి' తూగగల 'కెపాసిటీ' సన్యాసిరావుకి లేదు గాక లేదు.

సన్యాసిరావు ఆరడుగుల అందగాడు కాకపోయినా అయిదున్నర అడుగుల ఎత్తుగలవాడు. నీలి కళ్లు లేకపోయినా నీలమేఘశ్యాముడే! ఏనుగు దంతాల్లా ముందుకు పొడుచుకు రాకపోయినా-తెల్లగా మెరిసి పోయే పెద్ద పళ్లు, ఆయస్కాంతానికి అంటుకున్న గుండుసూదుల్లా - నిక్కబొడుచుకొని వుండే నల్లని వెంట్రుకలు - మరీ అంతలావు కాకపోయినా కాస్తంత స్థూలంగా అనిపించే శరీరం - చిరుబొజ్జతో - అల రారే సన్యాసిరావుకి అంతో ఇంతో ఆస్తి వుంది. ఆస్తికి సరిపడా ముగ్గురక్కచెల్లెళ్లు - బ్రాకెట్టులో డిగ్రీ - స్టేట్ గవర్నమెంట్‌లో లైబ్రేరియన్ ఉద్యోగం గల సన్యాసిరావుని - 'నువ్వు కోరుకునే అర్హతలుగల అమ్మాయిని ఎవరైనా నీకెలా ఇస్తారయ్యా!' - అని అడిగితే,

'నాకేంటయ్యా తక్కువ! కాస్త నల్లగానే వున్నాననుకో! అయితే మాత్రం... చదువు లేదా! ఉద్యోగం లేదా! ఆస్తి లేదా! అసలు మగవాడికి అందమెందుకయ్యా! ఆఁ" అని 'కోరికోరి కొరిమితో తల గోక్కున్నావేమిటా!' అని జుత్తు పీక్కునేలా వాదిం చెయ్యగలడు - తలబొప్పి కట్టేలా వాయించి పారెయ్యగలడు.

అందుకే-అతని పెళ్లి విషయంలో ఎవ్వరూ జోక్యం కలిగించుకోడానికి సాహసించరు. ఆఖరుకి అతని ఇంట్లో వాళ్లు కూడా 'మనకెందుకొచ్చిన పీడలే- అని వదిలేశారు - అతని ఖర్మకి.

అయినా సన్యాసిరావు పట్టువదలని విక్రమార్కుడిలా తన అభిరుచులకు తగ్గ అమ్మాయికోసం ప్రయత్నాలు సాగిస్తూనే వున్నాడు. ఇంతవరకూ - ముప్పై అయిదు పెళ్లి చూపులకి హాజరై, చూసిన ప్రతీ పెళ్లి కూతురులోనూ - ఉన్నలోపాల్ని, లేని లోపాల్ని ఎత్తి చూసి ముప్పై అయిదేళ్లు మీదపడినా వరుడుగానే మిగిలిపోయాడు.

మొదట్లో సన్యాసిరావు పెళ్లిచూపులకెళ్లినప్పుడు - మహదానందంగా వెళ్లేవాడు. ఏ మాత్రం మొగమాటంలేకుండా వాళ్లు పెట్టినవన్నీ పీకలదాకా మెక్కి, నానారకాల ప్రశ్నల్తో పెళ్లికూతుళ్లను వేధించి వాళ్లు భయంతో ముడుచుకునిపోతూ వుంటే తను పెద్ద హీరోలా పోజుపెట్టి-తన సామర్థ్యానికి తనే గర్వపడేవాడు.

ఇదంతా చూసిన అతని ఫ్రెండ్స్ - పెళ్లైై భార్యా బిడ్డలతో కాపురాలు చేసుకునేవాళ్లు - 'రకరకాల పిండి వంటలు.తినడం కోసమే నువ్వు పెళ్లి చూపులకి వెళ్తున్నావ'ని వేళాకోళం చేసేవారు సన్యాసిరావుని. దాంతో సన్యాసిరావుకి పౌరుషం పొంగుకొచ్చి - చివరికి ఎవర్నో ఒకర్ని చేసేసుకోవాలనే నిర్ణయానికి వచ్చి - ముప్పై ఆరో పెళ్లిచూపులకి హాజరయ్యాడు.


కాని - అప్పుడూ కథ అడ్డం తిరిగింది.

పెళ్లి కూతుళ్లలో లోపాలను ఎత్తి చూపడంలో ఆరితేరిన సన్యాసిరావు - 'చప్పిడి ముక్కు కాకుండా వుండివుంటే, కట్నకానుకలు కొంచెం అటూ ఇటూ అయినా చేసుకుని వుండేవాడినే' అని ఆ అమ్మాయి ముందే నోరు జారాడు.

అంతే! ఆ అమ్మాయి అపరకాళికాదేవి అవతారమెత్తింది.

'ఏమన్నావ్! నాది చప్పిడిముక్కా! నీ అందానికి నువ్వు ఇంకొకళ్లని ఎత్తి చూపడానికి నీకు సిగ్గులేదూ! కారు నలుపు, ఎత్తుపళ్లు, ముళ్లపందిలాంటి ఒళ్లు - పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చే రూపం నీది. నువ్వు నాకు పేరు పెడతావా!' అని ఎడాపెడా దులిపేసి 'మళ్లీ ఎప్పుడన్నా, ఎక్కడన్నా, ఏ అమ్మాయికైనా ఇలా పేరు పెట్టావని తెలిసిందో నీ తోలు వలిచేస్తాను. జాగ్రత్త!' అని వార్నింగిచ్చేసింది.

ఆ అమ్మాయి పదిమందిలోనూ అలా చేట్లో బియ్యం చెరిగినట్టు చెరిగేసరికి సన్యాసిరావుకి తల కొట్టేసినట్టైంది. ఉన్నచోటనే - భూమిలోకి కూరుకు పోతే బావుణ్ణనిపించింది సన్యాసిరావుకి.




నిజానికి - ముప్పై ఆరో పెళ్లి చూపుల అమ్మాయి ఎంతో బావుంది. ఇంకా నిజం చెప్పాలంటే ఆ అమ్మాయికి సన్యాసిరావు తగిన జోడీ కాదు. తనకి ఇష్టం లేకపోయినా ఆ అమ్మాయి తల్లిదండ్రుల బలవంతం మీద పెళ్లి చూపులకి ఒప్పుకుంది. దానికి తోడు సన్యాసిరావు ప్రవర్తన అగ్నిలో ఆజ్యం పోసినట్టైంది. ఆ అమ్మాయి రెచ్చిపోయింది.

తను అంతకుముందు పేర్లుపెట్టి వదిలేసిన ముప్పై అయిదుమంది అమ్మాయిల పరిస్థితీ ఇలాగే వుండి వుం

టుందన్న ఆలోచన రాగానే - సన్యాసిరావుకి జ్ఞానోదయం కలిగింది.

ఇదే అదననుకుని - ఆ అదనుకోసమే అంతకాలం నుంచి ఎదురుచూస్తున్న తల్లీ, తండ్రీ, అక్క, బావ, చెల్లెళ్లు అందరూ కలిసి - మూకుమ్మడిగా సన్యాసిరావు మీద దాడి చేసి - మెదడు తుప్పొదిలించేశారు. ఇక జన్మలో నీకు పెళ్లి అయ్యే యోగంలేదని భయపెట్టేశారు.

దెబ్బకి దెయ్యం వదిలినట్టు గొంతెమ్మ కోరికల మత్తులోంచి బయటపడి - 'మీరెవర్ని చేసుకోమంటే వాళ్లని చేసుకుంటాను. పెళ్లి చూపులకి కూడా నేను రాను. అంతా మీ యిష్టప్రకారమే కానీండి.' అని ఇంట్లో వాళ్లకి హామీ ఇచ్చేశాడు.




మళ్లీ వధువుకోసం వేట ప్రారంభమైంది. అంతకు ముందు ముప్పై ఆరు సంబంధాలు తెచ్చిన పెళ్లిళ్ల పేరయ్య 'ముప్పైయ్యేడో సంబంధం' అనగానే గతానుభవాల్ని గుర్తుకు తెచ్చుకుని - మూర్ఛవచ్చినంత పనై - నావల్ల కాదు పొమ్మన్నాడు. దాంతో సన్యాసిరావు మరో పేరయ్య కోసం వేట ప్రారంభించాడు. ఇంతకాలం పిల్లలకోసం వెతికాను. ఇప్పుడు పేరయ్య కోసం వెతుక్కోవాల్సిన ఖర్మ పట్టిందేవిటా అని లోలోపల విచారిస్తూ.

ఎలాగైతేనేం - చివరకి పేరయ్యని పట్టాడు. ఆ పేరయ్య పెళ్లి సంబంధాన్ని పట్టి తెచ్చాడు.

పేరమ్మ కూతురు పేరిందేవిని తమ్ముడికే ఇచ్చి పెళ్లిచేసి ఇల్లరికం తెచ్చుకుంది. పేరిందేవి కూతురు పైడితల్లి. ఆ పైడితల్లి పుత్రికారత్నమే మన పెళ్లి కూతురు పేరంటాలు.

పైడితల్లికి తమ్ముళ్లెవరూ లేకపోవడంవల్ల - బయటి సంబంధాలకోసం వెతుకుతోంది.

పేరమ్మ, పేరిందేవి గంగాభగీరథి సమానులు. పైడితల్లి భర్త పిచ్చయ్య అమాయకుడు. తనకంటూ ఒక ఇష్టం, అభిప్రాయం ఏమీలేవు. భార్య, అక్క, తల్లి ఏం చెయ్యమంటే అది చేస్తాడు. వాళ్లకి ఒక కొడుకున్నాడు. అంతా ఒకే ఇంట్లో వుండడంవల్ల, ఇచ్చిపుచ్చు కోడాలు కూడా ఇంట్లో ఇంట్లోనే జరగడంవల్ల - ఆస్తి బాగా కూడింది. కాని, అంతకుమించిన మహాభాగ్యమైన ఆరోగ్యం మాత్రం పేరంటాలికి లోపించింది.

పేరంటాలు పుట్టినప్పటి నుంచీ చాలా బలహీనంగా, మందంగా వుండేది. ఎప్పుడూ ఏదో ఒక జబ్బుతో బాధపడుతూనే వుంటుంది. మూడు తరాల తల్లులు - నాలుగో తరం వారసురాలైన పేరంటాలిని అతి గారాబంగా పెంచి పెద్ద చేశారు.

తుమ్మితే మందు, దగ్గితే మందు, ఆకలి వెయ్యకపోతే మందు, తిన్నది అరగకపోతే మందు. అన్నీ ఒకే టైంలో వాడేసి - ఎన్నో బలవర్ధకమైన పోషకాహారాల్ని ఇస్తూ - ఎంత అపురూపంగా పెంచినా పేరంటాలు మాత్రం ఎప్పుడూ ఎండిపోయిన తోటకూరకాడలా నీరసంగా పీలగా, పీక్కుపోయి వుండేది. దానికి తోడు ఆమెకి సినిమా పిచ్చి, అలంకరణ పిచ్చి ఒకదానితో ఒకటి పోటీపడేవి.

మనవరాలు షోకులకోసం, సినిమాలకోసం ఎంత ఖర్చుపెట్టినా ఆనందంగా భరిస్తుంది, ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలని పేరమ్మ. ఎలాగైతేనేం - పేరంటాలు పదో తరగతి పాసైంది. ఆ సందర్భంగా, పేరంటాలు అమ్మమ్మ తమ కులదైవానికి టెంకాయ కొట్టి, అర్చన చేసి - తమ ఇంటి చుట్టు ప్రక్కల పిల్లలందరికీ కొబ్బరి ముక్కలు పంచి పెట్టి 'మా పేరంటాలు పదో తరగతి పాసైందర్రా' అని అధికార పూర్వకంగా ప్రకటించింది.

'మీ పేరంటాల్ని పై చదువుకోసం కాలేజీలో చేర్పిస్తారా!' అని ఎవరైనా అడిగితే-

"ఎందుకమ్మా! దానికి పై చదువులు! కూటికి లేని వాళ్లమా! - గుడ్డకి లేని వాళ్లమా! ఆ రెండూ లేనివాళ్లైతే ఉద్యోగం చేసి - నాలుగు రాళ్లు సంపాదించుకోవడానికి చదువుకుంటారు. గాని, మాకేం ఖర్మ... అయినా మా ఇంట్లో ఇలాంటివి ఒప్పుకోం" అని దర్పంగా చెప్పేది.

'మరి పెళ్లి చేస్తారా!' అని అడిగితే- ఆవిడ మొగం దివిటీలా వెలిగిపోయేది.

'అవునేపిల్లా! దానికి సరైన ఈడు-జోడు కుదిరి, ఆస్తి - అంతస్థు కలిగి - మందీ మార్బలం లేని - ఏకైక వారసుడు ఎవరైనా వుంటే చెప్పండే!' అనేది.

పైగా- 'కట్న కానుకల విషయానికొస్తే - వాటికి మేమేం తక్కువ చెయ్యం. మాకున్న ఆస్తిలో సగందానికి, మిగతా సగం దాని తమ్ముడికి రాసేస్తాం. వాళ్లు తప్ప మాకెవరున్నారని!' అనేది పదిమంది లోనూ దర్పంగా.

దాంతో - ఆస్తి మీద వ్యామోహంతో ఎందరో పెళ్లి కొడుకులు పేరంటాలుని చేసుకోడానికి ఎగబడ్డారు. కాని - ఏం లాభం! ఒక్కరూ వారికి నచ్చ లేదు.

కారణం - ప్రపంచంలో ఎవరికీ దొరకని అపురూపమైన వ్యక్తి తమ ఇంటి అల్లుడు కావాలని మూడు తరాల ముసలమ్మల కోరికైతే - నాలుగో తరానికి చెందిన పేరంటాలి కోరిక మరోలా వుండేది.

అదేమిటంటే-తన షోకులకి, సినిమాలకి అయ్యే ఖర్చుల్ని తట్టుకుని నిలబడగలిగే ఆర్జన, మూవ్‌మెంట్స్‌లో, కట్స్‌లో రజనీస్టైల్, కమల్‌హాసన్ హెయిర్ స్టైల్, చిరంజీవి డేరింగ్, డాషింగ్ స్టైల్, అక్కినేని స్టెప్స్, శోభన్‌బాబు లాంటి సాఫ్ట్ రొమాంటిక్ లుక్స్... ఇలా పలువురు సినిమా హీరోల లక్షణాలు అన్నీ కలబోసిన వ్యక్తి తనకి వరుడుగా రావాలని పేరంటాలు కోరిక.

ఈ నాలుగు తరాల వారి కోర్కెలనూ తీర్చగల వరుడుకోసం దేశం నలుమూలలా గాలించారు. కాని లాభం లేకపోయింది.

కాలం సాగిపోతూనే వుంది కాని అది వాళ్లకి కలిసి రావడం లేదు. సరైన వరుడు దొరకడంలేదు.

పేరంటాలు వయసు ముప్పైదాట బోతోంది. మనిషి రోజు రోజుకీ సన్నగా, పీక్కుపోతూ మరీ పొడవుగా సాగిపోతోంది. ఆరోగ్యం కోసం రోజూ రకరకాల మందులు, టానిక్కులూ వాడుతూ వుండడం వల్ల-వాటి ప్రభావానికి జుట్టు తెల్లబడిపోడమే గాకుండా పల్చబడిపోతోంది కూడా!

మగదక్షత లేక - ఉన్న ఒక్క మగ దిక్కూ ఆడపెత్తనంలో అణిగి మణిగి పోవడంవల్ల ఖర్చు తప్ప ఆర్జన లేక- ఆస్తికి మించిన అప్పులు - అసలుని మించిన వడ్డీలూ పెరిగి అప్పుల వాళ్లు పేరమ్మ పీక పట్టుకునే స్థాయికి వచ్చింది.

"పిల్ల పెళ్లి చేసి - ఆస్తి అమ్మి అప్పులు తీర్చేస్తానాయనా" అని అప్పుల వాళ్లకి సర్ది చెప్పడంలోనే పొద్దుపోయేది పేరమ్మకి.

ఏదోఒక సంబంధం కుదిర్చి చేసేద్దామంటే అమ్మాయికి వయసెక్కువని వెళ్లిపోయేవాళ్లు చాలామంది. రోజులు గడుస్తున్న కొద్దీ- అమ్మాయి

వయసుకి తగ్గ వరుడు దొరకడం గగనమైపోతోంది. చివరకి వాళ్లకి పెళ్లి సంబంధాలు చూసి పెట్టే పెళ్లిళ్ల పేరయ్యకే విసుగుపుట్టి - 'ఇక నావల్లకాదు' అని రెండు చేతులూ ఎత్తి దండం బెట్టి పోబోతే - మూడు తరాల వారూ ఉమ్మడిగా అతని కాళ్లమీద పడ్డారు.

"నువ్వు కాకపోతే మాకు సంబంధాలు చూసే వాళ్లెవరున్నారు! ఈసారి నువ్వే సంబంధం తెచ్చినా చెయ్యడానికి సిద్ధంగా వున్నాం." అని ప్రాధేయపడ్డారు.

వాళ్ల పరిస్థితికి జాలిపడి - అనవసరంగా ఒక ఆడపిల్ల బ్రతుకు నాశనం కాకూడదనే ఉద్దేశంతో - మళ్లీ వరుల వేట ప్రారంభించాడు పేరయ్య.

• • •

వెతకబోయిన తీగె కాలికి తగిలినట్టు, ఆడబోయిన తీర్థం ఎదురైనట్టు - సన్యాసిరావు తండ్రి, పేరయ్యకి తగిలాడు - తన కొడుక్కి తగిన సంబంధం వుంటే చూడమని.

దొరక్క దొరక్క దొరికింది చేప. మెల్లిగా ఎరవేసి - జారిపోకుండా పట్టి బుట్టలో వేసెయ్యాలని తీర్మానించుకుని - పేరంటాలు అందచందాలు, ఆ వెనుక ఆస్తి పాస్తులూ - అదే పనిగా వర్ణించి వర్ణించి చెప్పసాగాడు పేరయ్య.

'ఆ అమ్మాయే గనక మీ కోడలైతేనా, మీ ఇంట లక్ష్మీదేవి తిరుగాడుతున్నట్టే అనుకోండి! బోలెడంత ఆస్తి. ఇద్దరే పిల్లలు. ఇప్పుడు మీకు కట్నకానుకల రూపంలో అర్జెంట్‌గా ఏమీ అందకపోయినా - ఆ అమ్మాయి అమ్మమ్మ, అమ్మల తదనంతరం సగం ఆస్తి మీ అమ్మాయికి రావడం ఖాయం. అమ్మాయి సన్నగా వున్నా గుణవంతురాలు. ఇక వినయం, విధేయత గురించి చెప్పక్కర్లేదు." అంటూ ఊరించి ఊరించి చెప్పడం ప్రారంభించేడు.

ఎలాగైతేనేం - సన్యాసిరావు తండ్రి పేరంటాలుని చూశాడు. అసలే కాటరాక్ట్ పేషెంటేమో-అతని మసక మసక కళ్లకి పేరంటాలు అందంగానే కనిపించింది. అన్నిటికన్నా అతన్ని ఆకర్షించింది ఆ అమ్మాయి వెనుకనున్న ఆస్తి. ఏదేమైనా ఈసంబంధాన్ని వదులుకోకూడదనే నిర్ణయానికి వచ్చేశాడు సన్యాసిరావు తండ్రి. సన్యాసిరావుని చూస్తే వాళ్లు ఒప్పుకుంటారో లేదోనని - సాధ్యమైనంతవరకూ పెళ్లిచూపుల తతంగం లేకుండానే ముహూర్తలు పెట్టించేసుకోవాలన్న తాపత్రయంతో - తన కొడుకు ప్రయోజకత్వం గురించి సుత్తి కొట్టడం ప్రారంభించేడు స.రా. తండ్రి.

'మా అబ్బాయి ఎంత బుద్ధిమంతుడో మీకేం తెల్సు పెళ్లిచూపులు కూడా అవసరంలేదు. ముందు నువ్వు చూసి, నీకు నచ్చితే చాలు. నేను చేసేసుకుంటాను' అన్నాడు మా అబ్బాయి. దీన్ని బట్టి మీరు అర్థంచేసుకోండి మావాడెలాటివాడో. వాడికి ఏ దురలవాట్లూ లేవు. ఈకాలం కుర్రాళ్లలా - మిడిసిపోవడం - పెడసరంగా ప్రవర్తించడం మావాడిలో అస్సలు లేవు. ఉద్యోగం పురుష లక్షణం - అన్నారు కాబట్టి వాడు ఉద్యోగం చేస్తున్నాడు గాని - నిజానికి వాడికా అవసరం లేదు. మా ఆస్తికంతటికీ వాడొక్కడే వారసుడు' అన్నాడు సన్యాసిరావు తండ్రి.

నాలుగు తరాల ఆడవాళ్ల మీద ఈ 'అస్త్రం' బాగా పనిచేసింది. పెళ్లిచూపులు ఏర్పాటు చేస్తే - పేరంటాలుని చూస్తే అబ్బాయి నచ్చుతుందంటాడో లేదోనన్న సందేహంతో నాలుగోతరం ప్రతినిధిని ప్రక్కకు నెట్టేసి - మూడుతరాలవారూ ముందంజవేసి 'పెళ్లిచూపులక్కర్లేదు. ముహూర్తలు పెట్టేసుకుందాం' అన్నారు.

ఇరుపక్షాల వారికీ - రొట్టె విరిగి నేతిలో పడ్డట్టైంది.

సన్యాసిరావు ఉద్యోగం ఏవిటో తెలుసుకున్న పేరంటాలు - 'ఆయన జీతం నా ఖర్చులకే చాలదు కదమ్మా' అంది సందేహంతో.

'జీతం తక్కువైతేనేమ్మా! బోలెడు ఆస్తికి ఏకైక వారసుడు. అటువంటి వాడు నీకు భర్తగా లభించడం నీ అదృష్టం' అంది పేరమ్మ.

'ఉన్న ఆస్తంతా చెల్లెళ్లకే సరిపోయేలా వుంది. ఇక నా గతేంటి' అని నిలదీశాడు సన్యాసిరావు - తండ్రిని.

'నీకేంరా! నీ దశ తిరిగింది. సగం ఆస్తితో వస్తోంది నీ పెళ్లాం. రాజభోగాలు అనుభవిస్తావు' అని సన్యాసిరావు నోరు నొక్కేశాడు తండ్రి.

• • •

పెళ్లిరోజున - పేరంటాలు మెళ్లో తాళికడుతూ తొలిసారిగా ఆమె మొహాన్ని చూసిన సన్యాసిరావుకి భోరుమని ఏడవాలనిపించింది. గడచిన ముప్పై ఆరు సంబంధాలలో - ఏయే వంకలు లోపాలు ఎత్తి చూపాడో అవన్నీ పేరంటాలులో కనిపించడం చూసి మనసులోనే కుళ్లిపోయాడు. మళ్లీ అంతలోనే 'సమయం మించిపోయింది ఇప్పుడిక ఎంత విచారిస్తే మాత్రం ఏం లాభం - నా తలరాత ఇలా ఏడిసింది' అని 'ఏమైతేనేం! అనుభవించడానికి ఆస్తి వుంది కదా!' అని సంబరపడ్డాడు.

సన్యాసిరావుని పెళ్లి పీటల మీద తొలిసారిగా చూసిన పేరంటాలు - 'ఈ సన్యాసిరావుని చేసుకునే బదులు సన్యాసినిగా వుండిపోయి వుంటేనే బాగుండేద'ని మనసులోనే విలపించింది. 'లక్షణమైన పెళ్లి కొడుకులు ఎందరో వస్తే - ఏదో ఒక వంక పెట్టి వాళ్లని కాదన్నందుకు నాకు దేవుడు తగిన శాస్తే చేశాడు.' అని వాపోయింది మనసులో. అంతలోనే తన షోకుల పిచ్చి, సినిమాల పిచ్చి గుర్తుకొచ్చి 'మనిషెలా వుంటేనేం బోలెడు ఆస్తి వుంది. పైగా ఒక్కడే వారసుడు' అని సంబరబడింది.

• • •

కాలగర్భంలో రెండేళ్లు గడిచిపోయాయి. ఆ రెండేళ్లలోనూ - పేరంటాలు ఆడబిడ్డల పెళ్లిళ్ల పేరుతో మావగారి ఆస్తంతా కరిగిపోయింది. పేరంటాలుతో సహా మూడుతరాల అమ్మలూ అన్యాయం - మోసం - దగా 'అంటూ లబోదిబో మన్నారు. ఎరుగున్న వాళ్లందరి ముందూ ఈ విషయం చెప్పి ఏడ్వడం ప్రారంభించేరు.

అప్పులాళ్లంతా పేరమ్మ పీక పట్టుకోవడంతో ఆస్తులన్నీ అమ్మేసి - అప్పులు తీర్చేసి మిగిలిన దాంతో కాలక్షేపం చేద్దామనుకుంది. కాని - ఆస్తులన్నీ అమ్మగా వచ్చిన సొమ్ములో ఒక్కనయాపైసా మిగల్లేదు, సరిగదా, తీర్చాల్సిన అప్పులే ఇంకా కొన్ని మిగిలాయి. చేసేది లేక - ఆస్తిలోనే గాదు, అప్పులో కూడా మీరు వాటా పంచుకోవాలి' అని సన్యాసిరావు తండ్రిని నిలేసింది.

'ఆస్తిలో వాటా లేకపోతే పీడాపోయె - ఛీ అప్పుల పీడ మా కొద్దు. మా ఖర్మానికి మమ్మల్ని వదిలెయ్యి తల్లీ.' అని కొడుకు పెళ్లినాడు పేరమ్మ పేరంటాలు పేర్ని సగం ఆస్తి రాసిన అగ్రిమెంట్ కాగితాలు చించి పారేశాడు సన్యాసిరావు తండ్రి.

'దీంతో మా పీడవదిలిపోయిందని సంబరపడుతున్నావేమో! చూడు బాబూ! మా పేరంటాల్ని చాలా అపురూపంగా పెంచుకున్నాం. కట్నకానుకల పేర్న - మేం ఆస్తిలో సగం వాటా ఇవ్వలేదని - పేరంటాల్ని సాధించడంగాని, వేధించడం గాని చేసారంటే మాత్రం మిమ్మల్ని వదిలేది లేదు. జాగ్రత్త!' అని వార్నింగ్ ఇచ్చి మరీ వెళ్లింది పేరమ్మ.

ఏం చెయ్యడానికీ పాలుపోక - నెత్తిమీద తుండుగుడ్డ వేసుకుని నిల్చున్న చోటనే కూలబడిపోయాడు నీరసంగా సన్యాసిరావు తండ్రి.

'దరి చేరిన నత్త-గువ్వలం'టే యిలాంటివారే అని అత్యాశకు పోయిన ఆ కుటుంబాల గురించి యిప్పటికీ చెప్పుకుని నవ్వుకుంటూ వుంటారు ఆ ఊరి ప్రజ.

• • •

**ఔనా!**

మన దేశంలో విడాకులు పొందుతున్న స్త్రీలలో ఎక్కువమంది ముస్లిమ్‌లు. ఆ తరువాత - హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, క్రైస్తవులు. విడాకులకు కారణాలుగా చెప్పేవి శీలం మంచిది కాకపోవడం, వంధ్యాత్వం, బీదరికం.

**చెరసాలలోనూ దుర్భరస్థితే!**

మన దేశంలో ఉన్న దాదాపు 1200 జైళ్లలో స్త్రీలకు ప్రత్యేకమైనవి ఆరు మాత్రమే. వాటిలో మొత్తం మీద 975 మంది ఖైదీలను మాత్రం ఉంచే వీలుందట! దేశం మొత్తం మీద ప్రతి ఏడాదీ సగటున నాలుగువేల మందిస్త్రీలుచెరసాలలలో ఉంటారని అంచనా!